
సాక్షి
కాకినాడ
శుక్రవారం । 14 । ఫిబ్రవరి । 2025



తల్లీపిల్లల ఆత్మహత్యాయత్నం

ఆర్థిక ఇబ్బందులు తాళలేక చాగల్లు మండలం చిక్కాల గ్రామానికి చెందిన తన ఇద్దరు పిల్లలతో ఓ తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనలో ఆమె మృతి చెందింది.


8లో



అంతర్వేదిలో నేత్రపర్వంగా..

కల్యాణోత్సవాల్లో భాగంగా అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి తెప్పోత్సవాన్ని గురువారం హంస వాహనంపై నేత్రపర్వంగా నిర్వహించారు.

డెల్టాలకు 8,850 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 8,850 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 4,400 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.45 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

కాకినాడ సిటీ: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లాలో అన్ని ఏర్పాట్లూ చేపట్టామని కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. ఈ ఎన్నికల నిర్వహణపై నియోజక వర్గ పరిశీలకురాలు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ఏలూరు కలెక్టరేట్ నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికలకు జిల్లాలో 42,463 మంది పురుషులు, 28,972 మంది మహిళలు, ఐదుగురు ట్రాన్స్‌జెండర్లు కలిపి మొత్తం 70,540 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. కాకినాడ డివిజన్‌లో 67, పెద్దాపురం డివిజన్‌లో 31 చొప్పున పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ నిర్వహణకు 25 శాతం రిజర్వుతో కలిపి 123 మంది పీవోలు, 123 మంది ఏపీవోలు, 246 మంది ఇతర పోలింగు సిబ్బందిని, 123 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని తెలిపారు. పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులకు ఈ నెల 14, 20 తేదీల్లోను, ఓపీవోలకు ఈ నెల 21న, మైక్రో అబ్జర్వర్లకు 22న కలెక్టరేట్‌లో శిక్షణ ఇస్తామన్నారు. ఈ నెల 26న కాకినాడ డివిజన్‌కు మెక్లారిన్ హైస్కూల్‌లోను, పెద్దాపురం డివిజన్‌కు పెద్దాపురం ఆర్డీవో కార్యాలయంలోను ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 27న కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాలులో రిసెప్షన్ సెంటరు, ఇంటర్మీడియట్ స్ట్రాంగ్ రూము ఏర్పాటు చేశామని కలెక్టర్ వివరించారు. జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు లేవన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు, శివరాత్రి ఏర్పాట్లు ఒకేసారి చేపట్టాల్సి ఉన్నందున సిబ్బంది కొరత లేకుండా ఏపీఎస్పీ బలగాల సహకారాన్ని తీసుకునేందుకు అనుమతి కోరామని తెలిపారు.

సెల్‌ఫోన్ సిగ్నల్స్‌కు చర్యలు తీసుకోండి



'సిగ్నల్ ఇవ్వు స్వామీ' శీర్షికన 'సాక్షి' ప్రచురించిన కథనం

సాక్షి ఇంపాక్ట్

అన్నవరం: రత్నగిరిపై సెల్‌ఫోన్ సిగ్నల్స్ నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా ఆయా కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌కు అన్నవరం దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు గురువారం లేఖ రాశారు. సత్యదేవుని సన్నిధిలో సెల్ ఫోన్ సిగ్నల్స్ సరిగ్గా లేక డిజిటల్ చెల్లింపులకు భక్తులు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 11న సాక్షి దినపత్రిక 'సిగ్నల్ ఇవ్వు స్వామీ..!' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై ఈఓ స్పందించి, కలెక్టర్‌కు ఈ మేరకు లేఖ రాశారు. అన్నవరం దేవస్థానంలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ ఉన్నప్పటికీ త్రీజీ సేవలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని ఆ లేఖలో తెలిపారు. అవి కూడా చాలా బలహీనంగా ఉంటున్నాయన్న విమర్శలు భక్తుల నుంచి వస్తున్నాయన్నారు. జియో, ఎయిర్ టెల్, వీఐ తదితర కంపెనీల సెల్ టవర్లు లేదా బూస్టర్లు రత్నగిరిపై లేవని, అందువలన వాటి సిగ్నల్స్ కూడా చాలా వీక్‌గా ఉంటున్నాయని వివరించారు. భక్తులకు డిజిటల్ పేమెంట్లు, వాట్సాప్ సేవలు త్వరితగతిన అందించాలంటే సెల్‌ఫోన్ సిగ్నల్స్ బాగా ఉండేలా ఆయా కంపెనీలు బూస్టర్లు ఏర్పాటు చేయాలని, దీనికి దేవదాయ శాఖ నిబంధనలను అనుసరించి సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

నాడు ఎ-గ్రేడ్ నేడు డీగ్రేడ్

- గతంలో టాప్ ర్యాంక్‌లో పిఠాపురం సీహెచ్‌సీ
- నేడు దిగజారిన వైద్య సేవలు
- డి–గ్రేడుకు పడిపోయిన వైనం



సీహెచ్‌సీలో ఓపీ చీటీల కోసం రోగుల అవస్థలు

పిఠాపురం: ప్రభుత్వ వైద్య రంగానికి గత వైఎస్సార్ సీపీ పాలనా కాలం స్వర్ణయుగమే. ఆ సమయంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎన్నో సౌకర్యాలు సమకూర్చారు. జీరో వేకెన్సీ పద్ధతిలో సిబ్బందిని, వైద్యులను నియమించారు. అంతకుముందు పాలకుల నిర్లక్ష్యానికి గురైన ప్రభుత్వ ఆసుపత్రులను గాడిన పెట్టారు. ఆ సమయంలో రాష్ట్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల(సీహెచ్‌సీ)లో పిఠాపురం సీహెచ్‌సీ ఎన్నో అంశాల్లో అగ్రస్థానం సాధించింది. అవుట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్లకు సేవలు, సాధారణ డెలివరీలు, సిజేరియన్లు, కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్సలు, ఎక్స్‌రేలు, లేబొరేటరీ పరీక్షలు.. ఇలా ప్రతి సేవలోనూ సామర్థ్యానికి మించి మిన్నగా నిలిచి, రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో కొనసాగింది. అది కూడా తక్కువ సిబ్బందితోనే ఈ ఘనత సాధించడం విశేషం.

పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీ, పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలాల్లోని 51 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 2.50 లక్షల మంది ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది రోగులు ఇక్కడి 30 పడకల సీహెచ్‌సీకి వస్తూంటారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ ఆక్సిజన్ సౌకర్యంతో కూడిన ఐసోలేషన్ బెడ్‌లు కూడా ఏర్పాటు చేశారు. అనేక మందికి కరోనా చికిత్సలు అందించారు. ప్రత్యేక పిల్లల వార్డులు నిర్మించి, మాతా శిశు వైద్య సేవలు అధికంగా అందించారు. ప్రైవేటు ఆసుపత్రులను తలదన్నే రీతిలో ఇక్కడ సమస్త సౌకర్యాలూ కల్పించడంతో నాడు వైద్య సేవల్లో ఈ సీహెచ్‌సీ రాష్ట్రంలోనే మిన్నగా నిలిచింది.

ఓపిక ఉంటేనే ఓపీ

సాధారణంగా ప్రభుత్వ ఆసుత్రుల్లో ఒకసారి ఓపీ చీటీ రాయించుకుంటే ఎన్నిసార్లు వచ్చినా వైద్య సేవలు వెంటనే అందిస్తూంటారు. దీనివల్ల రోగికి ఇబ్బంది లేకుండా ఉండేది. కానీ ప్రస్తుతం పిఠాపురం సీహెచ్‌సీలో ఆ పరిస్థితి లేదు. రోగి ఆసుపత్రికి వచ్చిన ప్రతిసారీ ఓపీ చీటీ రాయించుకోవాల్సిందేనని నిబంధన పెట్టారు. దీంతో వైద్యం కోసం వచ్చిన రోగులు ఓపీ చీటీ కోసం గంటల తరబడి క్యూలో వేచి ఉండాల్సి వస్తోంది. ఇలా రోజూ వస్తున్న రోగులకే పదేపదే ఓపీ చీటీలు రాస్తూ ఎక్కువ మందికి వైద్యం చేసినట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారన్న ఆరోపణలు కూడా వస్తున్నాయి. వైద్యులకు చూపించుకుని పరీక్షలు చేయించుకోవడం, మందులు రాయించుకోవడం ఒక ఎత్తయితే.. ఓపీ చీటీ రాయించుకోవడమే పెద్ద సమస్యగా మారిందని రోగులు ఆవేదన చెందుతున్నారు.



వైద్య సేవలందక చెట్ల నీడలో రోగులు, వారి బంధువుల పడిగాపులు

సిబ్బంది ఎక్కువ.. సేవలు తక్కువ

గతంలో వైద్యులు ఐదుగురే ఉండేవారు. ప్రస్తుతం వారి సంఖ్య ఎనిమిదికి పెరిగింది. నర్సింగ్ సిబ్బంది గతంలో ఐదారుగురు ఉండేవారు. ప్రస్తుతం 12 మంది ఉన్నారు. ఇతర సిబ్బంది కూడా తగినంత ఉన్నారు. అయినప్పటికీ నిత్యం వేలాదిగా వచ్చే అవుట్ పేషెంట్లకు అధిక సంఖ్యలో వైద్య సేవలు అందించేవారు. సౌకర్యాలు, సేవల్లో ఎటువంటి ఇబ్బందీ లేకుండా చూసుకునే వారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, రేడియోగ్రాఫర్, మెటర్నరీ అసిస్టెంట్, డార్క్‌రూం అసిస్టెంట్, స్టాఫ్ నర్సులు, ధోబీ, నర్సింగ్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది ఇలా అందరినీ నియమించినప్పటికీ.. నేడు వైద్య సేవలు పెరగకపోగా తగ్గిపోవడంపై రోగులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

డెలివర్రీయే..

ఈ సీహెచ్‌సీలో ప్రసవాలు, ప్రసూతి సేవలు, సాధారణ వైద్య సేవలు అందిస్తూంటారు. ఎక్కువగా మాతా శిశు సేవల కోసం ఇక్కడకు చుట్టుపక్కల ప్రజలు వస్తూంటారు. మాతా శిశు సంరక్షణకు గత ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం.. ఆ మేరకు వైద్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించడంతో ఎక్కువ సంఖ్యలో గర్భిణులు సీహెచ్‌సీకి వస్తున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించడంలో ఈ ఆసుపత్రి అప్పట్లో రికార్డు కూడా సాధించింది. గత ప్రభుత్వం అన్ని సౌకర్యాలూ కల్పించడంతో నెలకు 150 నుంచి 175 వరకూ డెలివరీలు చేసి రాష్ట్రంలోని సీహెచ్‌సీల్లో అగ్రగామిగా నిలిచింది. అటువంటిది ఇప్పుడు టార్గెట్ల పేరుతో ప్రతి నెలా వంద లోపు మాత్రమే డెలివరీలు చేస్తున్నారు. పైగా, ఎటువంటి పరీక్షలూ నిర్వహించకుండానే కాన్పు కోసం వచ్చిన గర్భిణులను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేస్తున్నారని పలువురు వాపోతున్నారు. ఇక్కడ డెలివరీలు చేయకపోవడంతో తీవ్ర వ్యయప్రయాసలు ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక కంటి, దంత వైద్య సేవలైతే మొత్తానికే మూసేశారు. వైద్య సేవలు దిగజారుతూండటంపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత విముఖత చూపారు. పిఠాపురాన్ని అభివృద్ధి చేస్తామని గొప్పగా చెప్పిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. కనీసం ఈ ఆసుపత్రిని అగ్రస్థానంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నాడు అన్నింటా ఎ-గ్రేడ్

- నాలుగేళ్ల కిందట పిఠాపురం సీహెచ్‌సీలో ప్రతి నెలా సగటున అవుట్ పేషెంట్ల సామర్థ్యం 87,000 కాగా, 89,635 మందికి వైద్య సేవలు అందించి, 103 శాతంతో రాష్ట్రంలోనే ఎ-గ్రేడ్ సాధించారు.
- ఇన్ పేషెంట్ల సామర్థ్యం 7,200 కాగా, 7,156 మందికి సేవలు అందించి 99.38 శాతంతో ఎ-గ్రేడ్ పొందారు.
- ప్రతి నెలా సిజేరియన్ శస్త్రచికిత్సల సామర్థ్యం 120 కాగా 434 చేసి 362 శాతంతో ఎ-గ్రేడ్ సాధించారు.
- కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్సల నెలవారీ లక్ష్యం 240 కాగా, ఏకంగా 1,090 చేసి 454 శాతంతో ఎ-గ్రేడ్‌లో నిలిచింది.
- ప్రతి నెలా సాధారణ డెలివరీల లక్ష్యం 360 కాగా, 1,716తో 477 శాతం సాధించి, ఎ-గ్రేడ్‌లో నిలిపారు.
- ఎక్స్‌రేల సామర్థ్యం 720 కాగా, 1,345 తీసి, 187 శాతంతో ఎ-గ్రేడ్లో నిలిచారు.
- లేబొరేటరీ పరీక్షల సామర్థ్యం 42,000 కాగా 47,931 చేసి 114 శాతంతో ఎ-గ్రేడ్ సాధించారు.

నేడు నిర్లక్ష్యపు చీకట్లు

గత ప్రభుత్వ హయాంలో అన్ని సేవల్లోనూ ఓ వెలుగు వెలిగిన ఈ సీహెచ్‌సీపై ప్రస్తుతం నిర్లక్ష్యపు చీకట్లు అలముకుంటున్నాయి. ప్రభుత్వ దవాఖానాకు నేను రాను బాబోయ్ అనే దుస్థితిని మళ్లీ రప్పించారు నేటి పాలకులు. ఫలితంగా పిఠాపురం సీహెచ్‌సీ వైద్య సేవల్లో నానాటికీ దిగజారుతోంది. నేడు సిబ్బంది దండిగా ఉన్నారు. గతంతో పోలిస్తే సౌకర్యాలు కూడా గణనీయంగా పెరిగాయి. అయినప్పటికీ గత ఏడాది మార్చి నుంచి ఇప్పటి వరకూ అవుట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్లు, సాధారణ డెలివరీలు, సిజేరియన్లు, కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్సలు, ఎక్స్‌రేలు, లేబొరేటరీ పరీక్షలు.. ఇలా అన్నిటిలోనూ ఈ సీహెచ్‌సీ అధోగతికి దిగజారిందని.. ఏ సేవలోనూ 50 శాతం కూడా దాటలేదని అధికారిక లెక్కలే చెబుతున్నాయి.



మూత పడిన కంటి వైద్య విభాగం

ఘనంగా జన్మనక్షత్ర పూజలు

- సత్యదేవుని దర్శించిన 30 వేల మంది
- రూ.30 లక్షల ఆదాయం

అన్నవరం: సత్యదేవుని జన్మనక్షత్రం మఖను పురస్కరించుకుని స్వామివారికి, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆయుష్య హోమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు తెల్లవారుజామున 2 గంటలకు ఆలయం తెరచి స్వామి, అమ్మవార్లకు సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు చేశారు. సత్యదేవుడు, అమ్మవార్ల మూలవిరాట్టులకు, శివలింగానికి పంచామృతాలతో మహన్యాస పూర్వక అభిషేకం నిర్వహించారు. అనంతరం సుగంధ భరిత పుష్పాలతో స్వామి, అమ్మవార్లను అలంకరించి పూజించారు. ఉదయం ఆరు గంటల నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు. యాగశాలలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ సత్యదేవుడు, అమ్మవార్లకు ఆయుష్య హోమం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు గొల్లపల్లి గణపతి ఘనపాఠి, అర్చకులు బులుసు శర్మ, వ్రత పురోహితుడు అంగర సతీష్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తెల్లవారుజామున జరిగిన సత్యదేవుని మహన్యాస పూర్వక అభిషేకంలో 17 మంది భక్తులు రూ.3 వేల చొప్పున టికెట్లు తీసుకుని పాల్గొన్నారు. అభిషేకానంతరం వారికి ఆలయంలో ప్రత్యేక దర్శనం చేయించి, పండితులు వేదాశీస్సులు, ప్రసాదాలు అందజేశారు.



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

నిజరూప దర్శనంలో..

సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీ అమ్మవారు, శంకరులు గురువారం ఎటువంటి ఆభరణాలూ ధరించకుండా నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. సుమారు 30 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించి, పూజలు చేశారు. ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది. సత్యదేవుని దర్శించిన అనంతరం భక్తులు గోశాలలో సప్తగోవుల చుట్టూ ప్రదక్షిణ చేసి, శ్రీకృష్ణుడిని దర్శించి, పూజలు చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, ప్రదక్షిణ చేశారు. సత్యదేవుని వ్రతాలు 1,500 నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. నిత్యాన్నదాన పథకంలో 5 వేల మంది సత్యదేవుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

నేడు చండీహోమం

రత్నగిరి వనదేవత వనదుర్గమ్మ వారికి శుక్రవారం చండీహోమం నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ హోమం, అనంతరం పూర్ణాహుతి నిర్వహిస్తారు. భక్తులు రూ.750 టికెట్టుతో ఈ హోమంలో పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు.

వైఎస్సార్ సీపీ పటిష్టతకు కృషి

తుని రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా అధ్యక్ష పదవి అప్పగించడంతో తనపై బాధ్యత మరింత పెరిగిందని మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని మండలం ఎస్.అన్నవరంలోని కార్యాలయంలో ఆయనకు జిల్లావ్యాప్తంగా గురువారం వచ్చిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. వైఎస్సార్ సీపీ రానున్న కాలంలో మళ్లీ అధికారం చేపడుతుందన్నారు. పార్టీ కోసం కష్టపడిన నాయకులకు, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యకర్తలే తనకు కొండంత బలమని చెప్పారు. తుని, కోటనందూరు, తొండంగి మండలాలకు కొత్తగా నియమితులైన మండల అధ్యక్షులను రాజా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మేరుగు పద్మలత, రాష్ట్ర మాల కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెదపాటి అమ్మాజీ, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివ, సామర్లకోట మున్సిపల్ చైర్మన్ దొరబాబు, నాయకులు యనమల కృష్ణుడు, వాసిరెడ్డి జమీలు, సకురు నాగేంద్ర నెహ్రూ, నాగం దొరబాబు, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు ఏలూరి బాలు, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, వైస్ చైర్మన్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు రాజాకు శుభాకాంక్షలు తెలిపారు. మూడు మండలాలు, పట్టణం నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు.



దాడిశెట్టి రాజాను గజమాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు, కార్యకర్తలు

లవ్ మార్కెట్



ప్రేమికుల కోసం సిద్ధంగా ఉంచిన ప్రత్యేక బహుమతులు



- నేడు ప్రేమికుల దినోత్సవం
- ఖరీదైన పువ్వులు, కానుకలు సిద్ధం
- టెడ్డీబేర్లకు సైతం డిమాండ్
- ఉమ్మడి జిల్లాలో జోరుగా విక్రయాలు





సాక్షి, అమలాపురం: 'నా కళ్లు చెబుతున్నాయి.. నిను ప్రేమించానని' అంటే సరిపోదు. ఇప్పుడు మారుతున్న కాలానికి, యువత ఆలోచనలకు తగ్గట్టుగా ప్రేమను వ్యక్తం చేయాలంటే అరుదైన.. ఖరీదైన బహుమతి కూడా ఉండాల్సిందే. మనసులో ఉన్న ప్రేమను వ్యక్తం చేయడానికి మంచి సాధనం బహుమతి. ప్రేమను పరస్పరం వ్యక్తం చేసుకునేందుకు గ్రీటింగ్ కార్డులు.. అందమైన గులాబీలు.. విలువైన కానుకలు అనుసంధానకర్తలు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా శుక్రవారం ప్రేమికుల దినోత్సవం జరుపుకొనేందుకు యువత సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు రకాల వ్యాపారాలు జోరుగా సాగుతూంటాయి. అందుకు తగినట్టుగా విక్రయాలకు వ్యాపారులు బహుమతులు సిద్ధం చేశారు.

'వాలెంటైన్స్ డే'.. ప్రేమికులకు ఒక రోజు. 3వ శతాబ్దంలో ప్రేమ కోసం పరితపించిన రోమన్‌కు చెందిన సెయింట్ వాలెంటైన్ గుర్తుగా ప్రేమికుల దినోత్సవం జరుపుకొంటారు. ఇది విష సంస్కృతి అని హిందూ భావజాలం ఉన్నవారు విమర్శిస్తున్నా యువతీ యువకులు ప్రేమికుల దినోత్సవాన్ని ప్రత్యేకంగా జరుపుకోవడం సర్వసాధారణమైంది. ప్రేమలో ఉన్నవారు ఏడాది పొడవునా విలువైన బహుమతులు అందిపుచ్చుకుంటున్నా.. ఫిబ్రవరి 14న పరస్పరం బహుమతులు ఇచ్చి పుచ్చుకోవడం ఇప్పుడు ఫ్యాషన్ అయ్యింది. ఈ నేపథ్యంలో అందమైన ఐటమ్ గులాబీలు.. ప్రేమ చిహ్నంతో ఉండే లక్కీ బేంబూలు.. చాక్లెట్ బాక్సులు.. టెడ్డీ బేర్లు.. పలు రకాల బొమ్మలు.. అందమైన బహుమతులు.. బంగారు ఆభరణాలు.. చివరకు హృదయ ఆకారంలోని దిండ్లు.. ఇలా ప్రేమ వ్యాపారం సాగుతోంది.

గులాబీలు.. ప్రేమకు చిహ్నాలు

బెంగళూరు రోజ్‌లు (కాడ గులాబీలు) బెంగళూరు, హైదరాబాద్‌ల నుంచి పెద్ద ఎత్తున దిగుమతి అవుతున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, మండపేట వంటి ప్రాంతాల వ్యాపారులు నేరుగా ఈ పూలను దిగుమతి చేసుకుంటున్నారు. యాజమాన్య పద్ధతిలో నిల్వ చేస్తే 10 నుంచి 15 రోజుల పాటు ఇవి పాడవకుండా ఉంటాయి. నిల్వ ఉండే ఈ పూలను ప్రేమికులు పరస్పరం ఇచ్చి పుచ్చుకుంటారు. ఉమ్మడి జిల్లాలో ఈ రెండు రోజులు రూ.50 లక్షల విలువైన పువ్వుల వ్యాపారం జరుగుతోందని అంచనా. వీటితో పాటు హృదయ ఆకారంలో ఉన్న లక్కీ బేంబూల అమ్మకాలు పెద్ద ఎత్తున సాగుతుంటాయి. గతంలో వీటిని పువ్వులు అమ్మేవారు, నర్సరీ మొక్కల దుకాణాల వద్ద మాత్రమే విక్రయించగా ఇప్పుడు గిఫ్ట్ షాపుల్లో కూడా అమ్మకాలకు ఉంచుతున్నారు.



విక్రయానికి సిద్ధంగా ఉంచిన గులాబీలు

మైమరపిస్తున్న గిఫ్ట్‌లు





ప్రేమికుల దినోత్సవం కోసం గిఫ్ట్ షాపుల్లో పలు రకాల బహుమతులు సిద్ధం చేశారు. ఒకప్పుడు ప్రేమలేఖలు, తరువాత గ్రీటింగ్ కార్డులు.. ఇప్పుడు విలువైన బహుమతులు ప్రేమికులు ఇచ్చి పుచ్చుకొంటున్నారు. టెడ్డీ బేర్లు.. పలు రకాల ఆకృతులలో ప్రేమికుల బొమ్మలు.. ఇలా చెప్పుకోవాల్సి వస్తే మార్కెట్‌లో వినూత్న ప్రేమ కానుకలు ఎన్నో మరెన్నో. వీటి వ్యాపార లావాదేవీలు సుమారు రూ.3.50 కోట్ల వరకూ ఉంటోందని వ్యాపారులు చెబుతున్నారు. అయితే వాస్తవంగా ఈ మార్కెట్ చాలా అధికం. కానీ ఇటీవల కాలంలో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ సంస్థలు రాయితీలు ఇచ్చి మరీ ప్రేమికులకు బహుమతులు, కానుకలను అందుబాటులో ఉంచడం వల్ల స్థానిక వ్యాపారం చాలా వరకూ తగ్గిందని అంటున్నారు.

సాధారణ రోజులతో పోలిస్తే..



ఆన్‌లైన్ వచ్చిన తరువాత స్థానిక వ్యాపారం చాలా వరకూ తగ్గింది. విలువైన బహుమతులను ఆన్‌లైన్ ద్వారానే రప్పించుకుంటున్నారు. సాధారణ రోజులతో పోలిస్తే ప్రేమికుల దినోత్సవం సందర్భంగా వ్యాపారం కొంత వరకూ పెరుగుతోంది. – శ్రీహరి, గిఫ్ట్స్ షాపు యజమాని, రాజమహేంద్రవరం

ప్రత్యేకంగా రప్పిస్తున్నాం



బెంగళూరు రకం గులాబీలు మా జిల్లాకు ప్రతి రోజూ వస్తూనే ఉంటాయి. కానీ ప్రేమికుల రోజున మాత్రం మేలు రకం గులాబీలు ప్రత్యేకంగా రప్పిస్తున్నాం. ఈ రోజు మంచి వ్యాపారం జరుగుతుంది. – వెంకటేష్, పూల వ్యాపారి, రాజమహేంద్రవరం

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

దిగుబడి పక్కా.. రాబడి చక్కా!

- ఏడాది పొడవునా సాగుకు అనుకూలమైన వంగ
- తగిన జాగ్రత్తలు పాటిస్తే రైతుకు మంచి ఆదాయం



పి.చంద్రశేఖర్, వ్యవసాయ సహాయ సంచాలకులు, కొవ్వూరు

పెరవలి: జిల్లాలో కూరగాయల పంటలు 2,795 హెక్టార్లలో సాగు జరుగుతుండగా ఇందులో వంగ 700 హెక్టార్లలో పండిస్తున్నారు. కూరగాయల పంటల్లో అతి ఎక్కువగా సాగు చేసేది, ఎక్కువగా వినియోగించేది వంగే. ఈ పంటను ఏడాది పొడవునా పండించవచ్చు. సమయాన్ని బట్టి, వాతావరణ పరిస్థితులను బట్టి పంటను సాగుచేస్తే మంచి దిగుబడులతో పాటు అధిక ఆదాయం కూడా పొందవచ్చు. వంగ పంటను సాగుచేయడానికి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలు, ఎరువుల యాజమాన్యం, తెగుళ్ల నివారణకు చర్యల గురించి కొవ్వూరు వ్యవసాయ సహాయ సంచాలకులు పి.చంద్రశేఖర్ వివరించారు.

విత్తే సమయం (నారు కోసం)

వంగ పంటను ఏడాదిలో 3 దఫాలుగా వేయవచ్చు. వర్షాకాల పంటను జూన్–జూలైలో, శీతాకాలపు పంటను అక్టోబర్–నవంబర్‌లో, వేసవి కాలం పంటను జనవరి–ఫిబ్రవరి నెలల్లో నారు కోసం విత్తుకోవచ్చు.

నారు నాటుకునే సమయం

వంగ పంట సాగుచేసే రైతులు 30 నుంచి 35 రోజులు వయస్సు కలిగిన నారును మాత్రమే నాటుకోవాలి. వర్షాకాలం పంటలో జూలై–ఆగస్టులోను, చలికాలం పంటను నవంబర్–డిసెంబర్‌లోను, వేసవి కాలం పంట ఫిబ్రవరి–మార్చినెలల్లో నాటవచ్చు.

విత్తనం రకాలు

ఎకరాకు సూటి రకాలు 250 గ్రాములు, సంకరజాతి రకాలు 150 గ్రాముల విత్తనం కావాలి. స్థానిక మార్కెట్‌లలో వినియోగదారుల అభిరుచిని బట్టి రకాలను ఎంపిక చేసుకోవచ్చు. జిల్లాలో ఎక్కువగా భాగ్యమతి, పూసాపర్పుల్ లాంగ్, పూసాపర్పుల్ క్లస్టర్, పూసా క్రాంతి, గులాబీ రకాలను ఎక్కువగా వినియోగిస్తారు. అక్కడక్కడా చారల వంగను కూడా సాగుచేస్తారు. ఈ పంట రకాన్ని బట్టి 130 నుంచి 150రోజుల వరకు ఉంటుంది.



అన్నవరప్పాడులో వంగతోట

నేలలు, నేల తయారీ

నీరు బాగా ఇంకే నల్లరేగడి, ఎర్రనేలలు వంటి రంగు కలిగిన సారంతమైన భూములను ఎంపిక చేసుకోవాలి. ఈ భూములను పంట వేసే ముందు నాలుగైదు సార్లు బాగా దున్ని చదును చేయాలి. నారు వేసిన తరువాత వర్షాకాలంలో బోదెలను ఏర్పాటు చేసుకోవాలి.

పాడి–పంట

నారుమడి పెంపకం

వంగ పంట సాగుచేసే ముందు నారుమడి పెంపకానికి 6 అంగుళాల ఎత్తు 1మీటరు వెడల్పు, 4 మీటర్ల పొడవు కలిగిన నారుమడులను ఎకరానికి 10 నుంచి 12 మడులను తయారుచేయాలి. 250 గ్రాముల విత్తనాన్ని ఈ మడులపై విత్తుకోవాలి. విత్తే ముందు 50 డిగ్రీల ఉష్ణోగ్రత కలిగిన నీటిలో విత్తనాలను 30 నిమిషాల పాటు నానబెట్టి నీడలో ఆరనివ్వాలి. ఆ తరువాత కిలో విత్తనానికి 3 గ్రాముల చొప్పున థైరామ్ లేదా ఇండోఫిల్ అనే మందుతో విత్తన శుద్ధి చేయాలి. ఆ తరువాత ట్రైకోడెర్మావిరిడి కల్చర్‌ను 1 గ్రాము విత్తనాలకు పట్టించి విత్తుకోవాలి. ఈ మడుల్లో నీరు నిలువ లేకుండా చూడటంతో పాటు ప్రతీరోజూ మడులపై తడుపుతూ ఉండాలి. నీరు నిలువ ఉండి మడులు మునిగిపోతే మాగుడు తెగులు ఆశిస్తుంది. దీని నివారణకు ఆక్సీక్లోరైడ్ మందును లీటరు నీటికి 3 గ్రాముల చొప్పున కలిపి వారం వ్యవధిలో రెండుమూడు సార్లు పిచికారీ చేయాలి. నారును పీకడానికి వారం రోజుల ముందే 250 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలను వేయాలి. చేలను ఆఖరి దుక్కు సమయంలో 200 కిలోల వేపపిండి, బ్యాక్టీరియా, ఎండుతెగులు ఆశించే ప్రాంతాల్లో ఎకరాకు 6 కిలోల చొప్పున బ్లీచింగ్ పౌడర్ వేయాలి. నారును నాటేముందు కార్బోఫ్యూరాన్ గుళికలు 10 కిలోలు వేయాలి.

ఎరువుల యాజమాన్యం

ఎకరాకు 6 నుంచి 8 టన్నులు పశువుల ఎరువును పంట వేసే ముందు ఆఖరి దుక్కులో వేయాలి. 24 కిలోల భాస్వరం, 24 కిలోల పొటాష్ దుక్కులో వేయాలి. నారువేసిన తరువాత ఎరువులను 30వ రోజు, 60వ రోజు, 75వ రోజున పైపాటుగా 40 కిలోల నత్రజనిని 3 సమభాగాలుగా చేసి నీటిని అందించాలి.

నీటి యాజమాన్యం

వంగ మొక్కలను నాటిన వెంటనే నీరు పెట్టాలి. వర్షాకాలంలో అవసరాన్ని బట్టి, శీతాకాలంలో 7 రోజులకు, వేసవిలో 3 నుంచి 5రోజులకు ఒకసారి నీరు అందించాలి. వేసవి పంటలో నీటితడులు కాయలు కోయడానికి రెండురోజుల ముందే ఇవ్వాలి. ఇలా ఇవ్వకపోతే వంకాయలు చేదుగా ఉంటాయి.

పురుగులు

మొవ్వ, కాయతొలుచు పురుగు

ఈ పురుగు ఎక్కువగా మొక్కలు నాటిన 30 నుంచి 40రోజుల్లో ఆశిస్తుంది. మొక్క పెరుగుదల దశలో మొవ్వను ఆ తరువాత దశలో కాయలను తొలిచి నష్టాన్ని కలుగజేస్తాయి. కాయలు వంకరగాను, కొమ్మల చివర్ల పెరుగుదల ఆగిపోతుంది. ఇది ఆశించిన వెంటనే కొమ్మలను తుంచి కార్బరిల్ 50శాతం 3 గ్రాములు లేదా ప్రొఫెనోపాస్ 2 మిల్లీలీటర్లు లేదా సైపర్‌మెత్రిన్ ఒక మిల్లీలీటరు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

రసం పీల్చే పురుగులు (దీపపు పురుగులు, పేనుబంక, తెల్లదోమ)

ఈ పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చివేయడం వల్ల ఆకులు పసుపు వర్ణానికి మారి పైకి ముడుచుకుని ఎండిపోతాయి. దీని నివారణకు డైమిథోయేట్ లేదా మిథైల్‌డెమెటాన్ లేదా ఫిప్రొనిల్ లీటరు నీటికి 2 మిల్లీమీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలి. తెల్లదోమ అధికంగా ఉంటే ఎస్సీటేట్ 1.5 గ్రాముల చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

తెగుళ్లు

ఆకుమాడు తెగులు, కాయకుళ్లు తెగులు

నారు నాటిన 30రోజులకు పంటను ఆశిస్తుంది. ఆకులన్నీ మాడిపోయినట్లుగా కనిపిస్తూ ఆకులపై గోధుమరంగు మచ్చలు ఏర్పడి పసుపు వర్ణంగా మారి వాడి రాలిపోతాయి. ఈ తెగులు చల్లని వాతావరణం ఉన్నప్పుడు పంటను ఆశిస్తుంది. కాయకుళ్లు సోకిన పంట ఆకులు గోధుమవర్ణంలోకి మారి రాలిపోతాయి. తెగులు సోకినకాయలు పసుపురంగుకి మారి కుళ్లిపోతాయి. వీటి నివారణకు కాపర్‌ఆక్సీక్లోరైడ్ మందును లీటరు నీటికి 3 గ్రాముల చొప్పున 10రోజుల వ్యవధిలో 2 నుంచి 3 సార్లు పిచికారీ చేయాలి.

వెర్రి తెగులు

ఈ తెగులు సోకిన మొక్కలు ఆకులు సన్నగా మారి పాలిపోతాయి. మొక్కలు గుబురుగా చీపురుకట్టలా తయారవుతాయి. పూత, కాయ లేకుండా మొక్కలు గొడ్డుబారిపోతాయి. ఈ తెగులు వైరస్ తెగులు. ఇది పచ్చదోమ ద్వారా వ్యాప్తి చెందుతుంది. తెగులు ఆశించిన మొక్కలను తొలగించి నాశనం చేయాలి. దీని నివారణకు రోగార్ లేదా మిథైల్ డెమటాన్ 2 మిల్లీలీటర్లు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తెగులు సోకిన మొక్కలను పీకివేసి జిబ్బరిల్లిక్ ఆమ్లం 50 మిల్లీగ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే తెగుళ్ల ఉధృతి తగ్గుతుంది.

ఎండు తెగులు

ఈ తెగులు నివారణకు ఎటువంటి చర్యలు లేవు. ఈ తెగులును తట్టుకునే రకాలను ఎంచుకుని సాగు చేయడమే.

వంగలో సమగ్ర సస్యరక్షణ

- పురుగు ఆశించిన కాయలను, కొమ్మలను త్రుంచి నాశనం చేయాలి.
- ఈ పంటలో అంతరపంటలుగా బంతి, ఉల్లి, వెల్లుల్లి వేసుకోవచ్చు.
- లింగాకర్షణ బుట్టలను ఎకరాకు 4 చొప్పున ఏర్పాటు చేయాలి.
- అల్లికరెక్కల పురుగులను మొక్కకు రెండుచొప్పున పంట పెరిగే దశలో విడుదల చేయాలి.
- ట్రైకోగ్రామా బదనికలను ఎకరానికి 20వేల చొప్పున విడుదల చేయాలి.
- బి టి మందులను లీటరు నీటికి ఒక గ్రాము చొప్పున పూత దశలో పిచికారీ చేయాలి.
- పంట పూత దశలో, కాయ దశలో 2,4–డి మందును 10 మిల్లీగ్రాములు ఒక లీటరు నీటికి లేదా నాఫ్తలీన్ అసిటికామ్లం ఒక మిల్లీలీటరు 5 లీటర్ల నీటికి కలిపి 10రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేస్తే 15 నుంచి 20 శాతం అధికోత్పత్తి పొందవచ్చు.

సీఐడీ డీఎస్పీ నాగరాజు అనుమానాస్పద మృతి



మృతిచెందిన డీఎస్పీ నాగరాజు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): సీఐడీ డీఎస్పీగా పనిచేస్తున్న బి.నాగరాజు (54) గురువారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. ప్రకాష్‌నగర్ పోలీసుల వివరాల మేరకు, స్థానిక శీలం నూకరాజు కాంప్లెక్స్ వద్దనున్న సాయిబాబా గుడి సమీపంలో నాగరాజు రోడ్డుపై పడి ఉన్నారు. స్థానికులు ఆయనను చూసి 108కి ఫోన్ చేయగా, వైద్య సిబ్బంది స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆయన అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ప్రకాశ్‌నగర్ పోలీసులు ఆయన వివరాలు సేకరించారు. సీఐడీలో రాజమహేంద్రవరం డీఎస్పీగా పనిచేస్తున్నట్లు గుర్తించి, ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగించారు. ఆయన కొంతకాలంగా సెలవులో ఉన్నారు. ఆయన ఫిట్స్‌తో మృతిచెంది ఉండవచ్చని పోలీసులను భావిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి మృతి

సఖినేటిపల్లి: రోడ్డుపై ఆబోతు వీరవిహారం చేయడంతో యువకుడు మృతి చెందిన వైనం బుధవారం అర్ధరాత్రి మండల పరిధిలోని రామేశ్వరంలో జరిగింది. మోరిపోడుకు చెందిన గుబ్బల మురళీకృష్ణ(30)బైక్‌పై అత్తవారిల్లు రామేశ్వరం వెళుతున్నాడు. రామేశ్వరంలోని పాటబళ్ల వారి గ్రూపులో వేపచెట్టు ఏరియాకు వెళ్లే సరికి ఆబోతు అతనిపై దాడి చేసింది. ఆబోతు కొమ్ము, మురళీకృష్ణ గొంతుకకు గుచ్చుకోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. సఖినేటిపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్వేదిలో నేత్రపర్వంగా..



అంతర్వేది చెరువులో నేత్రపర్వంగా సాగిన స్వామి, అమ్మవార్లు తెప్పోత్సవం

సఖినేటిపల్లి: అంతర్వేదిలో శ్రీలక్ష్మీనసింహస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా పదోరోజు గురువారం ఆలయానికి ఉత్తరం వైపున తవ్విన నూతన చెరువులో హంస వాహనంపై శ్రీస్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం నేత్ర పర్వంగా సాగింది. క్షేత్రంలో ఏటా తెప్పోత్సవం నిర్వహించే చెరువు జల జీవన్ మిషన్‌లో తాగునీటి ప్రాజెక్టుగా రూపుదిద్దుకుంటున్న తరుణంలో ప్రత్యామ్నాయ చెరువును ఇందుకు దేవస్థానం ఏర్పాటు చేసింది. తొలుత ఆలయం వద్ద నుంచి సాయంత్రం 5 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పక వాహనంపై ఊరేగింపుగా చెరువు వద్దకు అర్చకులు, భక్తులు తోడ్కొని వచ్చారు. 6 గంటలకు తెప్పోత్సవానికి ముందు ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు చెరువు వద్ద గంగపూజ నిర్వహించారు. పుష్పక వాహనంపై కొలువుదీరిన స్వామిని అర్చకుల వేదమంత్రాలతో, భక్తుల గోవిందనామ స్మరణలతో విద్యుద్దీపాలంకరణలతో ఉన్న తెప్పపైకి అధిరోహింపచేశారు. అర్చకులు, అధికారులు, ప్రముఖులు కొబ్బరికాయలు కొట్టి తెప్పోత్సవాన్ని ప్రారంభించారు. మూడు పర్యాయాలు చెరువు చుట్టూ బాణసంచా కాల్పుల మధ్య జరిగిన హంసవాహనంపై శ్రీస్వామివారి తెప్పోత్సవం భక్తులను అలరించింది. ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, అమలాపురం ఆర్డీఓ మాధవి, రామచంద్రపురం ఆర్డీఓ అఖిల, కొత్తపేట డీఎస్పీ మురళీమోహన్, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ బాలాజీ, ఎంపీపీ వీరా మల్లిబాబు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ ఆధ్వర్యాన ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు తెప్పోత్సవం భద్రతా చర్యలను పర్యవేక్షించారు. భీమవరానికి చెందిన దాత గొట్టుముక్కల భీమరాజు కైంకర్యంతో తెప్పోత్సం జరిగింది. ఇదిలా ఉండగా రాత్రి 8 గంటలకు స్వామివారికి అర్చకులు తిరుమంజనములు, దర్పణసేవ, ధూపసేవ, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, ద్వాదశ తిరువారాధన, శ్రీపుష్పోత్సవం, చెంగోల విన్నపం, తీర్థగోష్ఠి, స్వామివారి పవళింపు సేవ నిర్వహించారు.

తల్లీపిల్లల ఆత్మహత్యాయత్నం

- తల్లి మృతి, పిల్లల పరిస్థితి విషమం
- పురుగు మందు పిల్లలకు తాగించి తానూ తాగిన తల్లి
- ఆర్థిక ఇబ్బందులే కారణం



మృతురాలు దుర్గాభవాని

చాగల్లు: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఒక మహిళ తన ఇద్దరి పిల్లలతో సహా ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం మండలంలోని చిక్కాలలో జరిగింది. ఎస్సై కె.నరేంద్ర కథనం ప్రకారం బొర్రా దుర్గాభవానికి (35), సురేంద్ర గొడకు 13 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి అమ్మాయి జోత్స్న రత్నశ్రీ (11), అబ్బాయి జయదీప్(9) ఉన్నారు. భర్త లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా వారి కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు చోటు చేసుకున్నాయి. దీంతో ఆమె అన్నయ్య రామకృష్ణ ఆమెను స్థానికంగా ఉన్న వారి ఇంటికి తీసుకుని వెళ్లాడు. భర్త లారీపై కిరాయికి హైదరాబాద్ వెళ్లాడు. ఎవరూ లేని సమయంలో ఇంటి వద్దనే కలుపుమందును ముందుగా పిల్లలకు తాగించి తరువాత ఆమె తాగింది. తాను చనిపోతే పిల్లలు ఆలన పాలన ఉండదని, ఇబ్బంది పడతారనే ఉద్దేశంతో వారికి కూడ పురుగు మందు తాగించింది. విషయం తెలుసుకున్న బంధువులు వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి వారిని తరలిస్తుండగా దుర్గాభవాని మార్గమధ్యలోనే మరణించింది. పిల్లలు రాజమహేంద్రవరంలోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతురాలి అన్నయ్య రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నరేంద్ర తెలిపారు.

వేధింపుల వల్లే వివాహిత ఆత్మహత్య

బాధ్యుడిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

అమలాపురం టౌన్: అమలాపురం రూరల్ మండలం కంసాలి కాలనీలోని తన అద్దె ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సరెళ్ల కవిత (30) మృతికి ఆ కుటుంబంతో సన్నిహితంగా ఉన్న దూనబోయిన పెద్దిబాబు వేధింపులే కారణమని పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. ఈ నెల 7వ తేదీన ఆత్మహత్య చేసుకున్న కవిత కేసును దర్యాప్తు చేయగా పట్టణంలోని అబ్బిరెడ్డివీధి శివారు జంగం పాలేనికి చెందిన పెద్దిబాబు ఆమెతో సన్నిహితంగా ఉంటూ వేధింపులకు గురి చేశాడని తేలిందని సీఐ పేర్కొన్నారు. వివాహేతర సంబంధంతోపాటు తరుచూ పెద్దిబాబు పెట్టే వేధింపులు తట్టుకోలేక ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు తమ దర్యాప్తులో తేలిందన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కవితను బీసీ సామాజిక వర్గానికి చెందిన పెద్దిబాబు వేధించిన కారణంగా అతనిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ చెప్పారు. మృతురాలి కవితకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెద్దిబాబు వివాహితుడే కాకుండా అతనికీ ఇద్దరి పిల్లలు ఉన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరి మృతి

ఇద్దరికి తీవ్ర గాయాలు

పెద్దాపురం: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలైన ఘటన గురువారం స్థానిక పెద్దాపురం–సామర్లకోట రహదారిలో చోటు చేసుకుంది. స్థానిక డీఎస్పీ కార్యాలయం సమీపంలో బంక్ వద్ద రెండు బైక్‌లు బలంగా ఢీ కొట్టుకున్నాయి. ఈ ప్రమాదానికి ఇద్దరు మైనర్లు కారణం కాగా మరొక వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. అటుగా వెళ్లుతున్న ఎస్ఐ మౌనిక ఘటనా స్థలాన్ని పరిశీలించి, సమయానికి 108 వాహనం రాకపోవడంతో క్షతగాత్రులను ఆమె వాహనం, ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా ఈ ఘటనలో స్థానిక పరదేశమ్మ కాలనీకి చెందిన నాగూర్ (15) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై ఎస్ఐ మౌనిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనుల పండువగా భీమేశ్వరస్వామి తెప్పోత్సవం



సప్త గోదావరిలో హంస వాహనంపై కల్యాణమూర్తులు



ద్రాక్షారామ భీమేశ్వరాస్వామి ఆలయం వద్ద సప్తగోదావరి నదిలో దేదీప్యమానంగా కల్యాణ తెప్పోత్సవం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ క్షేత్రంలో మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా 6 వ రోజు గురువారం రాత్రి ఆలయ ప్రాంగణంలో గల సప్త గోదావరి నదిలో తెప్పోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. రంగురంగుల విద్యుత్ దీపాలంకరణ కాంతుల నడుమ తెప్పోత్సవాన్ని తిలకించిన భక్తులు పులకించిపోయారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణమూర్తులను వేద పండితులు ఆలయం నుంచి తోడ్కొని వచ్చి సప్తగోదావరిలో విద్యుత్ దీపాలంకరణలతో, పుష్పాలంకృతమైన హంస వాహనంలో ఉంచి ఆస్థాన పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణమూర్తులకు నీరాజన మంత్ర పుష్పాలు సమర్పిస్తుండగా మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారు మూడుసార్లు నదిలో జలవిహారం చేశారు. వేలాదిమంది భక్తులు స్వామివారి తెప్పోత్సవాన్ని తన్మయత్వంతో తిలకించారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని, వేగాయమ్మపేట జమీందారు వాడ్రేవు సుందర రత్నాకరరావు, అర్చకులు, సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణోత్సవాల్లో పాలుపంచుకున్నారు.

అతిరుద్ర మహాయజ్ఞం ప్రారంభం

- నేడు వద్దిపర్తి పద్మాకర్ సర్వం శివమయం ప్రవచనం
- 22న శ్రీవారి సామూహిక శాంతి కల్యాణం
- వివరాలు వెల్లడించిన కృష్ణ సోమయాజి



సమావేశంలో పాల్గొన్న కృష్ణసోమయాజి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): లోకాసమస్త సుఖినోభవంతు అనే సదుద్దేశంతో రాజమహేంద్రవరంలో మొట్టమొదటిసారిగా శ్రీ రాజశ్యామలా సహిత పంచాయతన పూర్వక అతిరుద్ర మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు యజ్ఞ సారధ్యం వహిస్తున్న కడియాల వెంకట కృష్ణ సోమయాజి తెలిపారు. గోదావరి గట్టున ఉన్న శ్రీ త్యాగరాజ నారాయణదాసు సేవా సమితి ఆవరణలో గురువారం మహాయజ్ఞం ప్రారంభించిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్రీ భోగలింగేశ్వర ధార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో 12 రోజులపాటు ఈ మహాయజ్ఞం జరుగుతుందన్నారు. ఈ నెల 24 వ తేదీ వరకు తన సారధ్యంలో 150 మంది పండితులు ఈ మహాయజ్ఞం నిర్వహిస్తారని వివరించారు. నిత్యం ఉదయం నుంచి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, గణపతి, సుబ్రహ్మణ్యం ,రాజశ్యామలా జపాలు, రుద్ర హోమాలు, సూర్యనమస్కారాలు, చండీ పారాయణలు జరుగుతాయని కృష్ణ సోమయాజి తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం సాంస్కృతిక , ఆధ్యాత్మిక ప్రవచనాలు ఉంటాయని తెలిపారు. 22వ తేదీ సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సామూహిక శాంతి కల్యాణం జరుగుతుందన్నారు. నిర్వాహకుడు ముసునూరి అయ్యప్ప మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో మొట్టమొదటిసారిగా 150 మంది పండితులతో శ్రీ రాజశ్యామలా సహిత పంచాయతన పూర్వక అతిరుద్ర మహాయజ్ఞం నిర్వహిస్తున్నామని భక్తులు ఈ మహాయజ్ఞంలో పాల్గొని తరించాలని కోరారు. ఆధ్యాత్మిక ప్రవచనాల్లో భాగంగా ఈనెల 14 వ తేదీ సాయంత్రం బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ సర్వం శివమయం ప్రవచనం జరుగుతుందని అయ్యప్ప తెలిపారు. సాయంత్రం సమయంలో అన్నమాచార్య కీర్తనలు, సుందరాకాండ ప్రవచనం, నిజజీవితంలో ఆధ్యాత్మికత తదితర అంశాలపై కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బరిలో 35 మంది

ఏలూరు (మెట్రో): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 35 మంది నిలిచారు. గురువారం 8 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. మొత్తం 54 మంది నామినేషన్లు దాఖలు చేయగా 11 మంది నామినేషన్లను అధికారులు ఇప్పటికే తిరస్కరించారు. మరో 8 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో ఎమ్మెల్సీ ఎన్నికల పోటీల్లో 35 మంది అభ్యర్థులు ఉన్నారు. ఈ నెల 27న పోలింగ్ జరుగనుంది.

నామినేషన్ల ఉపసంహరణ

స్వతంత్ర అభ్యర్థులు గద్దే విజయలక్ష్మి, డాక్టర్ కవల నాగేశ్వరరావు, దుర్గారావు పచ్చిగొళ్ల, పేరాబత్తుల సత్యవాణి, బాలాజీ గుండుమోలు, పిళ్లంగోళ్ల లీలా నగేష్, సత్తిరాజు స్వామి, చక్రపాణి కోండ్రు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు.

పోటీలో ఉన్న అభ్యర్థులు

పేరాబత్తుల రాజశేఖరం (తెలుగుదేశం), కాట్రు నాగబాబు (తెలుగు నవగర్జన), షేక్ హుస్సేన్ (రిఫార్మ్ పార్టీ ఆఫ్ ఇండియా) కాగా స్వతంత్ర అభ్యర్థులు.. కట్టా వేణుగోపాలకృష్ణ, కాండ్రేగుల నరసింహం, కాళ్లూరి కృష్ణమోహన్, కుక్కల గోవిందరాజు, కునుకు హేమాకుమారి, కైలా లావణ్య, గౌతం బాబు కొల్లు, చిక్కాల దుర్గారావు, తాళ్లూరి రమేష్, దత్తాత్రేయ నోరి, దిడ్ల వీరరాఘవులు, దొరబాబు యాళ్ల, నీతిపూడి సత్యనారాయణ, పినిపే నాగభూషణవర్మ, పిప్పళ్ల సుప్రజ, పేపకాయల రాజేంద్ర, బొడ్డు శ్రీనివాసరావు, బొమ్మనబోయిన వీఎస్ఆర్ మూర్తి, బొమ్మిడి సన్నిరాజ్, బండారు రామమోహన్‌రావు, భీమేశ్వరరావు చిక్కా, మాకే దేవీ ప్రసాద్, మెర్ల శాస్త్రులు, మోకన అంబేడ్కర్, రాజపూడి, జెటి రామారావు, రేవుల గడ్డ మహేష్‌బాబు, వానపల్లి శివగణేష్, ఎం.శ్రీనివాసరావు, శ్రీనివాస్ విప్పవరుల, జీవీ సుందర్, హసన్ షరీఫ్ పోటీలో ఉన్నారు.

Name of the post	Qualification
CSE Faculty (M/F)	M.Tech with Ph.D M.Tech MCA
ECE Faculty (M/F)	M.Tech with Ph.D M.Tech
Physics Faculty (M/F)	M.Sc., Physics
Pharmacy Faculty (M/F)	M.Pharmacy (Pharmaceutics) M.Pharmacy (Pharmacology) /Pharm D M.Pharmacy (Pharm Chem/Pharm Analysis)
Animal Husbandy Faculty(M/F)	B.V.Sc/M.V.Sc
Management Faculty (M/F)	M.B.A.
Mathematics Faculty (M/F)	M.Sc., Mathematics
Agriculture Faculty (M/F)	M.Tech
CRT & Soft skills trainer	Any PG and Presentation skills
Construction Incharge	Any Degree with 10+ years experience
Accounts Manager	B.Com with 15+ years experience. Knowledge in MS OFFICE and Tally
Administrative Officer	Any degree.10+ years experience